
# ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఆర్ఎంపీల ఇష్టారాజ్యం
- వికటిస్తున్న వైద్యం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లాలో అర్హతలేని ఆ ర్ఎంపీ, పీఎంపీలు వైద్య రంగాన్ని తమ సొంత ఆస్తిలా మార్చేసుకున్నారు. ప్రాథ మిక చికిత్సకు మాత్రమే అనుమతి ఉన్న వీరు ఇప్పుడు పూర్తి స్థాయి వైద్యుల్లా వ్యవహరిస్తున్నారు. మందుల షాపులు, క్లినిక్లు, బెడ్లు, ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ – అన్నీ ఏర్పాటు చేసుకొని ప్రజల అనారోగ్య సమస్యలను లాభదాయక వ్యాపారంగా మార్చే శారు. నియమావళిని విస్మరిస్తూ యాంటీబయోటిక్స్, ఇంజక్షన్లు, గర్భిణులకు చికి త్సలు, శస్త్రచికిత్సలు కూడా నిర్వహిం చడం సాధారణంగా మారింది.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వాన్ని దోపిడీ చేస్తున్న వీరికి అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. జిల్లాలో సుమారు 600 మందికి పైగా ఆర్ఎంపీ, పీఎంపీలు ఉన్నట్లు అంచనా. వీరిలో చాలామందికి కనీస అర్హతలూ, అనుభవమూ లేవని స్థానికులు చెబుతున్నారు. యూని యన్ల పేరుతో కమిటీలు ఏర్పరచుకొని చట్టవిరుద్ధంగా క్లినిక్లు, మెడికల్ షాపులు నడుపుతున్నారు. ఫలితంగా సాధారణ ప్రజలు ఆరోగ్యపరంగా ప్రమాదంలో పడటమే కాక ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు.

పట్టణాల నుండి పల్లెల దాకా పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు పెరుగుతున్నాయి. వైద్యశాఖ అనుమతి లేకుండా ఔషధాలు అమ్మడం, ఇంజక్షన్లు ఇవ్వడం, సలైన్ ఎక్కించడం రోజువారీ వ్యవహారంగా మా రింది. నిబంధనల ప్రకారం ఫార్మసీలు మాత్రమే మందులు విక్రయించవలసి ఉన్నప్పటికీ ఆర్ఎంపీలు క్లినిక్ లోపలే షాపులు నడుపుతున్నారు. ఎవరు వీరికి మందులు సరఫరా చేస్తున్నారన్నది ప్రశ్నగా మారిం ది. డబ్బు కోసం కాసుల కక్కుర్తితో ప్రాణాలను పణంగా పెడుతున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ఈ అక్రమాలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా అనుమతి లేని వైద్యం బహిరంగంగానే సాగుతోంది. సీనియర్ ఆర్ఎంపీల వద్ద శిక్షణ తీసుకున్న కొందరు యువకులు ఇప్పుడు తామే వైద్యులమని చెప్పుకుంటూ గ్రామాల్లో క్లినిక్లు తెరచి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షణ లోపం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల భీమిని మండలం జగ్గయ్యపేటలో జరిగిన ఘటన దీనికి ఉదాహరణ. జ్వరం వచ్చిన వ్యక్తికి ఆర్ఎంపీ రెండు ఇంజక్షన్లు ఇచ్చిన వెంటనే అతని పరిస్థితి విషమించింది. బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, ఆ తర్వాత కరీంనగర్ ఆసుపత్రికి తరలించినా ప్రాణాలు నిలువలేదు. ఇలాంటి సంఘటనలు జిల్లాలోని పలు మండలాల్లో చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ, ఔషధ నియంత్రణ శాఖ కలసి అర్హతలేని క్లినిక్లు, మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్య వైద్యుల దృష్టిఅభావం ప్రజల ప్రాణాలను నాశనం చేస్తోందని, ప్రతి మండలంలో సమగ్ర తనిఖీలు జరిపి అక్రమ వైద్యశాలలను మూసివేయాలని వారు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సామాజిక సంస్థలు కూడా అభిప్రాయపడుతున్నాయి.

## మైనింగ్ ఏడీపై చర్యలు తీసుకోండి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అందుగులపేట శివారు సర్వే నెంబర్ 9లో గుట్టపై జరుగుతున్న అక్రమ తవ్వకాలపై ఆర్టీఐ ద్వారా కోరగా తప్పుడు సమాచారం ఇచ్చారని మైనింగ్ ఏడీపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు కాకుండా ప్రైవేట్ వెంచర్లకు అమ్మకానికి సహకరిస్తున్న ఏడీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఘనంగా ముకేశ్ గౌడ్ జన్మదిన వేడుకలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

తెలంగాణ రాష్ట్ర జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముకేశ్ గౌడ్ జన్మదిన వేడుకలు నస్పూర్ టౌన్లో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా బీఎంఎస్ ఆటో యూనియన్ అధ్యక్షుడు చెల్ల విక్రమ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి సుమారు 45 మంది నిరుపేదలకు ఆహారం పంపిణీ చేశారు. తలసేమియా బాధితుల కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పులి రాజేందర్ గౌడ్, శనిగరపు రాయాలింగు, గోగుల మధు, బానోత్ రాజు, హనుమంతు రావు, కుంభం మల్లేష్, గాలిపెల్లి బానేష్, కేదం హరీష్, చెల్ల శివ, రాజు, మోహన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ, రహదారులు, మురుగు కాలువల పనులను పరిశీలించారు. ప్రతి ఇంటికి త్రాగునీరు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని, చెత్త సేకరణను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల ఉత్పత్తి, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్ రాజలింగుతో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో రెండు పడకగదుల ఇండ్ల పథకం, అమృత్ 2.0 పథకంలోని నీటి బ్యాంకుల నిర్మాణ పనులను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు



## ప్రజలకు చేరువలో యూనియన్ బ్యాంక్

**ఆర్థిక అవగాహన పెంపుపై దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం మందమర్రి మండలం గద్దెరాగడిలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖ కార్యాలయాన్ని సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, బ్యాంక్ ఏజీఎం రాధాకృష్ణ, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, శాఖ మేనేజర్ సంజీవ్ తలకోటి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గద్దెరాగడిలో బ్యాంక్ శాఖ ప్రారంభంతో స్థానిక ప్రజలకు, వినియోగదారులకు బ్యాంకు సేవలు మ రింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పొదుపు, బీమా, పెన్షన్, పెట్టుబడుల వంటి సేవలతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శాఖ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేసి జిల్లా పురోగతికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, బ్యాంకు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రైతుల పంటలన్నీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- ఆత్మ చైర్మన్ రాజు యాదవ్

**శెనార్తి మీడియా, బోథ్:**

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బోథ్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో రైతులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ, ఇప్పటికే మొక్కజొన్న పంట కొనుగోలు ప్రారంభమైందని, సోయాబీన్ కొనుగోలుకు సంబంధించి జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మార్క్‌ఫెడ్ డీఎంలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వచ్చే నాలుగు రోజుల్లో సోయా పంట కొనుగోలు ప్రారంభమవుతుందని వివరించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీలు రైతులపై ప్రేమ ఉన్నట్లు నటించి రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధ ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని రాజు యాదవ్ స్పష్టం చేశారు.

## భైంసా మాస్టర్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

**కలెక్టర్ అభిలాష అభినవ్**




**నిర్మల్, అక్టోబర్ 24 :**

భైంసా మాస్టర్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, అమృత్ 2.%ూ% పథకం కింద భైంసా మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలుకు మొదటి కన్సల్టేటివ్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భైంసా మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ దోహదపడుతుందని అన్నారు. ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే పూర్తిచేయడంతో పాటు, సోషియో ఎకమిక్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. వివిధ జిల్లా శాఖ అధికారులు 15 రోజుల లోపు సంబంధిత డాటా మొత్తం అందజేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఆయా శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులకు చేసిన ప్రణాళికల వివరాలు అందించాలని అన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, త్రాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపడతాయని వివరించారు. మాస్టర్ ప్లాన్ అమలులో సంబంధిత అధికారులందరూ భాగస్వామ్యం అవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జి.ఐ.ఎస్ హబ్ డిటిసిపి ప్రాజెక్ట్ డైరెక్టర్ అశ్వినీ యాదవ్, డిటిసిపివో వరంగల్ ఆర్డీ జ్యోతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు భారత్ బంద్ అలర్ట్

- సరిహద్దు ప్రాంతాల్లో చెన్నూర్ పోలీసుల విస్తృత తనిఖీలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మావోయిస్టు పార్టీ భారత్ బంద్ పిలుపు నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో హై అలర్ట్ జారీ చేయడంతో చెన్నూర్ రూరల్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా బంద్ పిలుపు వచ్చిన నేపథ్యంలో రామగుండం కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిగాయి. ప్రాణహిత నది ఫెర్రీ పాయింట్లు, సరిహద్దు రహదారులు, కల్వర్టులు, వాహనాలపై పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, కోటపల్లి, నీల్వాయి పోలీసు సిబ్బంది, స్పెషల్ పోలీసు బృందాలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణానికి అందరి భాగస్వామ్యం అవసరం

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

**కరీంనగర్, అక్టోబర్ 24 :**



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పిలుపునిచ్చారు.నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల భాగంగా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి తెలంగాణ చౌక్ మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు విద్యార్థులు, మహిళలు, స్వయంసహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ర్యాలీలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.తరువాత కమిషనరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రంగోలి, వాల్ పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా గౌస్ ఆలం మాట్లాడుతూ, "మత్తు పదార్థాలు వ్యక్తి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. యువత, విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకునేందుకు పుస్తకాలు చదవడం, క్రీడల్లో పాల్గొనడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడడం వంటి మార్గాలు ఎంచుకోవాలి" అని సూచించారు. డ్రగ్ వ్యసనాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందని, తరచూ తనిఖీలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉన్నవారు భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్న అధికారులను అభినందించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఎంతో అవసరమని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, డ్రగ్స్ యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తాయని హెచ్చరించారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు పాజిటివ్ కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల నృత్య రూపకం ఆకట్టుకుంది. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అదనపు డీసీపీలు వెంకటరమణ, భీమ్‌రావ్, డీఐఓ బి.గంగాధర్, సిడిపిఓ సవిత, ఎన్ఎంబీఏ కమిటీ సభ్యుడు పెండ్యాల కేశవరెడ్డి పాల్గొన్నారు.

## హరితహారం నిధులు చెల్లించండి

**మొక్కలు పెంచిన వారికి డబ్బులు ఇవ్వాలంటూ సీఐటీయూ వినతి**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

హరితహారం కార్యక్రమంలో మొక్కలు పెంచిన ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ... 2018–19, 2019–20 సంవత్సరాల్లో మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 12 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు మొక్కలు పెంచగా, మున్సిపల్ అధికారులు వాటిని స్వీకరించినప్పటికీ సంబంధిత డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదని తెలిపారు. 2020 నుండి మాత్రమే చెల్లింపులు జరిగాయని, మిగతా బకాయిలను ఇప్పటికీ ఇవ్వలేదని చెప్పారు. మొక్కలు పెంచిన సభ్యులకు డబ్బులు అందించకుండా అధికారులు ఇతరులకు ఇచ్చినట్లు చూపించారని ఆరోపించారు. గతంలో మున్సిపల్ కమిషనర్లకు పలు వినతులు ఇచ్చినా పరిష్కారం కాలేదని తెలిపారు. తేది 16-06-2025న మున్సిపల్ కమిషనర్‌కు, తేది 28-04-2025న జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు దాసరి రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అనిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యమైన పత్తి తీసుకురావాలి : కలెక్టర్

**ఆదిలాబాద్, అక్టోబర్ 24 :** రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్ యార్డులకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీసీఐ ద్వారా క్వింటాకు రూ. 8,110 కనీస మద్దతు ధరను నిర్ధారించగా, ప్రైవేట్ మార్కెట్ ధర రూ.6,500గా ఉందన్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. రైతులు "కపాస్ కిసాన్" యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి సదుపాయాలు కల్పించామని చెప్పారు. మార్కెట్ యార్డుల్లో తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, కంట్రోల్ రూమ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈ నెల 27వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో పత్తి కొనుగోలు ప్రారంభమవుతుందని తెలిపారు.